సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 20 । జూన్ । 2023



అర్జీలకు సంతృప్తికర పరిష్కారం

పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో కలెక్టర్ నిషాంత్ కుమార్ అర్జీలు స్వీకరించారు. సంతృప్తికర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. - 8లో



'తాడ్డి' మృతిపై నేతల సంతాపం

మాజీ ఎమ్మెల్యే తాడ్డి సన్యాసినాయుడు మృతిపై పలువురు నాయకులు సంతాపం తెలిపారు. గజపతినరగంలోని ఆయన స్వగృహం వద్ద పార్థివ దేహానికి అంజలి ఘటించారు. - 8లో



అత్యాశతో ఆన్‌లైన్‌మోసాలకు గురికావద్దు

యువత అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని ఎస్పీ ఎం.దీపిక హెచ్చరించారు. ఆన్‌లైన్ మోసాల తీరుపై అవగాహన కల్పించారు. - 8లో

న్యూస్‌రీల్

విద్యాసంస్థలో టూరిజం క్లబ్స్



సమావేశంలో మాట్లాడుతున్న పర్యాటక శాఖ అధికారి ఎస్.నారాయణరావు

పార్వతీపురంటౌన్: విద్యా సంస్థల్లో టూరిజం క్లబ్స్‌ను ఏర్పాటుచేస్తున్నట్టు పర్యాటక శాఖ అధికారి ఎస్.నారాయణరావు తెలిపారు. పార్వతీపురంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పర్యాటక రంగంపై యువతలో ఆసక్తి, అభిరుచి పెంపొందించేందుకు పర్యాటక శాఖ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా టూరిజం క్లబ్స్ ద్వారా విభిన్న సంస్కృతులు, భౌగోళిక ప్రాంతాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. దేశ, రాష్ట్ర, జిల్లాలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలపై విశ్లేషణాత్మక చర్చలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. టూరిజం క్లబ్‌లో పాల్గొనడం వలన టీమ్‌వర్క్ మేనేజ్‌మెంట్, లీడర్ షిప్ నైపుణ్యాలు యువతలో పెంపొందుతాయన్నారు. చురుగ్గా ఉండే విద్యార్థులను క్లబ్ గైడ్‌లుగా, వలంటీర్లుగా నియమిస్తామని చెప్పారు.

ఏపీఎస్పీ బెటాలియన్‌ను సందర్శించిన డీఐజీ



బెటాలియన్‌లోని పాఠశాలలో సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏపీఎస్పీ బెటాలియన్ డీఐజీ రాజకుమారి

డెంకాడ: ఏపీఎస్పీ చింతలవలస ఐదవ బెటాలియన్‌ను నాలుగవ రేంజ్ డీఐజీ బి.రాజకుమారి సోమవారం సందర్శించారు. బెటాలియన్ కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి ఆహ్వానించారు. అనంతరం బెటాలియన్‌కు చెందిన పాఠశాలలో ల్యాబ్‌ను ప్రారంభించారు. బెటాలియన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కమాండెంట్ రాహుల్‌దేవ్‌శర్మ, అడిషినల్ కమాండెంట్ రాజు పాల్గొన్నారు.

భద్రగిరి ప్రభుత్వ ఆర్ఐటీ ఐలో జాబ్‌మేళా రేపు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలోని భద్రగిరి ప్రభుత్వ రెసిడెన్షియల్ పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో (ఆర్ఐటీఐ)లో ఈనెల 21వ తేదీన ఎల్అండ్‌టీ కంపెనీలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ చదివిన వారు, పాలిటెక్నిక్‌లో సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ చదివిన వారు, ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ చదివిన వారు అర్హులని, 18 నుంచి 35 ఏళ్ల వయస్సు కలిగి, 155 సెంటీ మీటర్ల ఎత్తు, 45 కేజీల బరువు కలిగిన అభ్యర్థులు జాబ్‌మేళాకు విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

పిడుగుపడి గొర్రెలకాపరి మృతి

బొండపల్లి: విజయనగరం జిల్లా బొండపల్లి మండలం తమటాడ గ్రామంలో సోమవారం వేకువజామున పిడుగుపడడంతో కోండ్రు అప్పన్న (54) అనే గొర్రెలకాపరి మృతిచెందాడు. గ్రామంలోనే గొర్రెలకు కాపలా ఉండగా ఘటన జరిగినట్టు ఎస్ఐ ఎస్.రవి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజపతినగరం సీహెచ్‌సీకి తరలించారు. మృతునికి భార్య, కొడుకు ఉన్నారు. ఇంటి పెద్ద మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఆరోగ్య యోగం



ఆరి సుందర శివరావు, యోగా శిక్షకుడు, విజయనగరం

- కరోనా మహమ్మారి తర్వాత యోగా సాధనపై ప్రజల్లో చైతన్యం
- వివిధ ప్రాంతాల్లో ముమ్మరంగా శిక్షణ తరగతులు
- ఆరోగ్య సమస్యల నుంచి ఊరట
- భవిష్యత్తులో రోగాల నుంచి రక్షణ కవచం
- 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

ప్రపంచానికి భారతదేశం అందించిన సంజీవని యోగా. దీని సాధన ద్వారా పూర్వీకులు అనేక అద్భుతాలు చేశారు. ఆరోగ్య, మానసిక సమస్యలనే కాదు సరైన నడవడిక ద్వారా సామాజిక చైతన్యాన్ని కలిగించారు. తరతరాలుగా దీన్ని ఆచరించినప్పటికీ కరోనా మహమ్మారి విజృంభణ తర్వాత మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చింది. ఆరోగ్య పరిరక్షణకు దీని సాధనపై ప్రజలు దృష్టి పెడుతున్నారు. అందుకు తగినట్లుగానే ఉమ్మడి విజయనగరం జిల్లాలో శిక్షణ కేంద్రాలు పెరిగాయి. అవకాశమున్న ప్రతి చోటా అవగాహన కల్పించడానికి శిక్షకులు ప్రత్యేకంగా కృషి చేస్తున్నారు. ఈనెల 21వ తేదీ (బుధవారం) అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

యోగాతోనే పరిపూర్ణమైన ఆయుష్షు...



'యోగా చిత్తవృత్తి నిరోధకః' అని శాస్త్రం చెబుతోంది. మనం చేసిన పనులు, చూసిన దృశ్యాలు, వినడం ద్వారా గ్రహించిన అంశాలను గుర్తించుకునే ప్రదేశాన్నే చిత్తం అంటారు. ఇందులో చెడు ఆలోచనలను తొలగించుకోవడమే యోగా సాధన. బుద్ధి, మనస్సు ప్రశాంతంగా ఉంచి, జ్ఞానేంద్రియాలను అదుపులోకి తెచ్చుకోవడం వల్ల శరీరంలో ఉన్న అవయవాలు సక్రమంగా, స్వేచ్ఛగా పనిచేయడం వల్ల పరిపూర్ణం ఆయుష్షును పొందవచ్చు.

– కొరుపోలు సత్యారావు, వ్యవస్థాపకుడు, శ్రీసత్యాయోగా కేంద్రం, విజయనగరం

ప్రతి ఒక్కరికీ అవసరం...



ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందడానికి యోగ సాధన ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ అవసరం. మనో ధైర్యం కూడా పెంపొందించుకోవచ్చు. గజపతినగరంలోని కల్కి భగవాన్ ధ్యాన మందిరంతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులకు యోగాపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం.

– శ్రీర వాసు, యోగా శిక్షకుడు, గజపతినగరం



యోగ సాధనలో గజపతినగరం గ్రామ సచివాలయ ఉద్యోగులు



విజయనగరంలోని శ్రీసత్యా యోగా కేంద్రంలో యోగాసనాల సాధన

ఏడేళ్లుగా..

రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో ఏడేళ్లుగా యోగాశిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నాం. ఉచితంగా శిక్షణ ఇస్తున్నాం. ప్రతి వారం అమృతాహారం అందిస్తున్నాం. యోగా సాధన మన జీవన విధానంలో ఒక భాగం. దీనిద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుంది. రోజంతా ఉత్సాహంగా ఉంచుతుంది. రక్తపోటు రాకుండా కాపాడుతుంది.

– ఆరి సుందరశివరావు, యోగా శిక్షకులు, విజయనగరం

ఆసక్తి పెరిగింది



కరోనా తర్వాత యోగాభ్యాసనంపై ప్రజల్లో ఆసక్తి పెరిగింది. ప్రతి ఒక్కరూ యోగా సాధన చేస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు తదితర ప్రదేశాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం.

– గవిడి సుజాత, యోగా గురువు, శ్రీ చైతన్య యోగా సంస్థ, చీపురుపల్లి

యోగాతో ఏకాగ్రత



ప్రతిఒక్కరూ యోగా సాధన చేయాలి. దీనివల్ల శరీరం దృఢంగా ఉంటుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మేధాశక్తి, ఏకాగ్రత్తను పెంపొందించుకోవచ్చు. మంచి మార్గంలో నడిపించే ఆలోచనలకు యోగా ఓ అస్త్రం.

– అధికారి సింహాచలం, యోగా గురువు, నారాయణ యోగా కేంద్రం, పార్వతీపురం

ఒత్తిడి నుంచి ఉపశమనం...



యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. శారీరక, మానసిక ధృడత్వాన్ని పొందవచ్చు. మానసిక ఆధిపత్యాన్ని సాధించవచ్చు. శరీరంలోని నాడులను ఉత్తేజంతో ఉంచవచ్చు. ఇలా యోగా సాధనతో జీవనంలో ఉన్నత స్థితిని అందుకోవచ్చు.

– కనకదండి సత్యలక్ష్మి, శ్రీ యోగ విద్యా సంస్థ నిర్వాహకురాలు, బొబ్బిలి

విజినిగిరి యోగా చైతన్యరామం

జామి మండలం విజినిగిరి గ్రామంలోని యోగా గురువు రాపర్తి రామారావు 1983 సంవత్సరంలో స్థాపించిన యోగా చైతన్య సంస్థ ఎంతో ప్రాచుర్యం పొందింది.

ఇప్పటివరకూ దాదాపు 50 వేల మంది ఇక్కడ యోగసాధనలో శిక్షణ పొందారు. పచ్చని చెట్ల మధ్య సువిశాల ప్రదేశంలోనున్న ఈ ఆశ్రమం ఎంతోమంది మానసిక వికాసం పొందడానికి దోహదం చేస్తోంది. దీనికి అనుబంధంగా విశాఖపట్నం, నంద్యాల, కర్నూలు, భీమవరం, రాజమహేంద్రవరం, కాకినాడ, ఏలూరు, యానాం తదితర ప్రాంతాల్లో యోగా శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. న్యూఢిల్లీలోని సెంట్రల్ కౌన్సిల్ రీసెర్చ్ నేచరోపతి సంస్థ గుర్తింపు పొందింది.



విజినిగిరిలోని యోగా చైతన్య సంస్థ

ఆచరించాల్సిన ఆసనాల్లో కొన్ని..



పశ్చిమోత్తనాసనం: దీని సాధన ద్వారా శరీరంలో పొట్ట చుట్టూ పెరిగిన కొవ్వును తగ్గించుకోవచ్చు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.



నత్తగుల్ల ఆసనం: దీని ద్వారా వెన్నెముక సామర్థ్యం పెరుగుతుంది. రక్తప్రసరణ సవ్యంగా జరుగుతుంది. రక్తశుద్ధికి దోహదం చేస్తుంది. గొంతుకు సంబంధించిన వ్యాధులకు దూరంగా ఉండవచ్చు.



హలాసనం: వెన్నెముక సమస్యల నుంచి కాపాడుతుంది. థైరాయిడ్ గ్రంథులను ఉత్తేజపరుస్తుంది. కపదోషాన్ని హరిస్తుంది.



వృక్షాసనం: ఇది ఏకాగ్రతను పెంచుతుంది. మనసుకు ప్రశాంతతను సమకూర్చుతుంది. రోగనిరోధక శక్తి పెరగడానికి దోహదం చేస్తుంది.



వక్రాసనం: మధుమేహం (సుగర్) సమస్య నుంచి కాపాడుకోవచ్చు. శరీరంలో గ్లూకోజ్ స్థాయిని నిరోధిస్తుంది.



చక్రాసనం : ఇది జీర్ణాశయం పనితీరును పెంచుతుంది. థైరాయిడ్ గ్రంధులను ఉత్తేజం చేస్తుంది.



సర్వాంగాసనం: ఇది నడుం నొప్పిని తగ్గిస్తుంది. రక్త ప్రసరణ బాగా జరగడానికి దోహదం చేస్తుంది. ముఖవర్చస్సు పెరుగుతుంది.



అర్ధ రాజక పోతాసనం: నడుంనొప్పిని తగ్గిస్తుంది. కిడ్నీల పని తీరును మెరుగుపరుస్తుంది. చెడు కొవ్వును కరిగిస్తుంది.



ఉష్ట్రాసనం: ఇది మెడనొప్పిని తగ్గిస్తుంది. కిడ్నీలో ఏర్పడిన రాళ్లను కరిగించడానికి దోహదపడుతుంది.



శీర్షాసనం: ఇది మెదడులో రసాయనాలను పెంచుతుంది. దీంతో ఉత్తేజంగా పనిచేస్తుంది. జుట్టురాలే సమస్యను అరికడుతుంది.

ముఖ్యమంత్రి పర్యటనకు

సభాస్థలం పరిశీలన



ముఖ్యమంత్రి సభాస్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్, కలెక్టర్ నిషాంత్‌కుమార్, తదితరులు

కురుపాం: అమ్మఒడి నిధులను ఈ నెల 28వ తేదీ బుధవారం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కురుపాం వేదికగా విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేయనున్నారు. ఈ సందర్భంగా సీఎం పర్యటన ఏర్పాట్లను, సభా స్థలిని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, కలెక్టర్ నిషాంత్‌కుమార్ సోమవారం పరిశీలించారు. కురుపాం నుంచి దాసరిపేట గ్రామానికి వెళ్లే రోడ్డులో ప్రైవేటు స్కూల్ సమీపంలోని గ్రౌండ్‌ను పరిశీలించారు. సీఎం సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో వాహన పార్కింగ్, రాకపోకలకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. పరిశీలనలో ఆర్డీఓ హేమలత, సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్, డీఎస్పీ జి.వి.కృష్ణారావు, ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ రమేష్‌కుమార్, ఎస్ఐ ప్రసాద్ పాల్గొన్నారు.

రూ.1.76 కోట్లతో బల్లుకోటకు రోడ్డు

కురుపాం: గిరిజన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. కురుపాం మండలం గొటివాడ పంచాయతీ బల్లుకోట గిరిజన గ్రామానికి రూ.1.76 కోట్ల ఐటీడీఏ నిధులతో టేకరఖండి నుంచి మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి పూజ చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే గిరిజనులకు విద్య, వైద్య సేవలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలు కలుగుతుందని పుష్పశ్రీవాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యురాలు సుజాత, కురుపాం సర్పంచ్ సుజాత, ఉప సర్పంచ్ ఆదిల్, ఎంపీటీసీ సభ్యురాలు విద్యారాణి, మండల కన్వీనర్ గౌరీశంకరరావు, టి.కోటి, శెట్టి నాగేశ్వరరావు, ఎ. కోటేశ్వరరావు, ఐ.రామకృష్ణ, రేవు సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



బల్లుకోట గిరిజన గ్రామ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

దేవదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు

- దేవదాయశాఖ ఉత్తరాంధ్ర డిప్యూటీ కమిషనర్ సుజాత
- పాలకొండ, పార్వతీపురం, వీరఘట్టంలలో జగన్నాథస్వామి రథాల తనిఖీ



పాలకొండలో జగన్నాథస్వామి రథాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ సుజాత

సాక్షి ఎఫెక్ట్

వీరఘట్టం/పాలకొండ: దేవదాయ శాఖ భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ ఉత్తరాంధ్ర డిప్యూటీ కమిషనర్ సుజాత స్పష్టంచేశారు. పాలకొండ నగరపంచాయతీ, వీరఘట్టం మేజర్ పంచాయతీలోని జగన్నాథస్వామి ఆలయాల మాన్యాలు అన్యాక్రాంతం అవుతున్నాయని, ఏళ్ల తరబడి ఒకరి వద్దే ఉండిపోవడంతో భూములకు రావాల్సిన లీజు సొమ్ము సక్రమంగా వసూలు కావడంలేదని, ఆలయాల నిర్వహణ భారంగా మారుతోందన్న అంశంపై ఈనెల 14న 'సాక్షి'లో ప్రచురితమైన 'దేవుడా' కథనంపై దేవదాయశాఖ అధికారులు స్పందించారు. దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత వీరఘట్టం, పాలకొండలలో ఉన్న జగన్నాథస్వామి ఆలయాలను సోమవారం సందర్శించారు. దేవాలయాల భూములపై ఆరా తీశారు. వచ్చే ఏడాది పక్కాగా ఆలయ భూములకు బహిరంగ వేలం నిర్వహించి భూముల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడతామన్నారు. మంగళవారం నుంచి జరగనున్న రథ యాత్రను వైభవంగా నిర్వహించాలని అర్చకులకు సూచించారు. రథయాత్రలో ఎటువంటి అపశ్రుతి చోటుచేసుకోకుండా చర్యలు చేపట్టాలన్నారు. భక్తులందరికీ స్వామి దర్శన భాగ్యం కల్పించాలని ఈఓ రాధాకృష్ణను ఆదేశించారు.

అగ్నివీర్ ఆర్మీ ర్యాలీకి పక్కా ఏర్పాట్లు

- జూలై 20 నుంచి ఆగస్టు 2 వరకు ర్యాలీ
- ఏర్పాట్లపై సమీక్షించిన కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: విజయనగరం జిల్లాలో వచ్చేనెల 20 నుంచి నిర్వహించే అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీకి అధికారులంతా తమ శాఖలకు అప్పగించిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తిచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. రోజుకు కనీసం 1000 మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందని, ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి సూచనల మేరకు సదుపాయాలు కల్పించాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ వినయ్‌కుమార్‌తో కలిసి సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఏర్పాట్లపై జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు. పీటీసీలో జరిగే ర్యాలీకి అవసరమైన రన్నింగ్ ట్రాక్, రైన్ ప్రూఫ్ షెల్టర్స్, షామియానాలు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బందోబస్తు, లైటింగ్, సీసీటీవీలు, తాగునీరు, స్నాక్స్, తాత్కాలిక మరుగుదొడ్లు, భోజనం, రవాణా సదుపాయం వంటివి కల్పించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్ మూడు భాషల్లో మాట్లాడగల ఉపాధ్యాయులను అనౌన్స్‌మెంట్ కోసం నియమించాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి కి సూచించారు. సెట్విజ్ సీఈఓ రామ్‌గోపాల్ అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సమన్వయం చేసుకోవాలన్నారు. అధికారులంతా విజయనగరం పీటీసీ గ్రౌండ్స్‌ను సందర్శించి అవసరమైన ఏర్పాట్లను పూర్తిచేయాలన్నారు.

ఆర్మీ రిక్రూట్మెంట్ అధికారి కల్నల్ వినయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాలకు చెందిన నిరుద్యోగుల కోసం అగ్నివీర్ రిక్రూట్మెంట్ ర్యాలీ 2023–24ను విజయనగరం జిల్లాలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మొదటి దశలో ఆన్‌లైన్‌లో నిర్వ హించిన రాత పరీక్ష ఉత్తీర్ణులైన 10 వేల మంది కి శారీరక, వైద్య పరీక్షలు విజయనగరం పీటీసీ గ్రౌండ్‌లో నిర్వహిస్తామన్నారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, డీఆర్వో గణపతిరావు, పీటీసీ ప్రిన్సిపాల్ ఆదిబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

క్లుప్తంగా

జాగాకోసం కొట్లాట


చికిత్సకోసం వచ్చిన సత్యవతి

పార్వతీపురం: పార్వతీపురం మండలం బందలుప్పి గ్రామంలో జాగా కోసం ఓ కుటుంబంలో కొట్లాట జరిగింది. ఈ కొట్లాటలపై పార్వతీపురం ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెల్లూరు సత్యవతికి ఉన్న ఖాళీ స్థలంలో ఆమె అక్క కందకుర్తి జయమ్మ, బావ సూర్యనారాయణలు కంకరవేసి చదును చేస్తున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సత్యవతి మా నాన్నగారు ఇచ్చిన స్థలంలో మీరు ఎందుకు కంకరవేస్తున్నారని ప్రశ్నించగా బావ సూర్యనారాయణ, అక్క జయమ్మలు సత్యవతిని తిడుతూ, దుర్భాషలాడుతూ చేయి చేసుకున్నారు. దీంతో ఆమెకు గాయాలు కావడంతో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి చికిత్సకోసం చేరింది.

వివాహిత ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేసిన మహిళను రక్షించిన ఫైర్, పోలీస్ సిబ్బంది

కొత్తవలస: భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, ఆర్థిక లావాదేవీల కారణంగా మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన ఐ.కుమారి(42) సోమవారం గ్రామంలో గల వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ క్రమంలో కుటుంబసభ్యులు వారించినప్పటికీ ట్యాంక్‌పై నుంచి దూకేందుకు ప్రయత్నించింది. దీంతో ఆమె కుమారుడు చంద్రశేఖర్ తన తల్లిని రక్షించాలని కొత్తవలస ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశాడు. దీంతో ఫైర్ స్టేషన్ ఎస్సై వై.అశోక్‌కుమార్, స్థానిక ఎస్సై వీరజనార్దన్ హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి ఆమెకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అన్నివిధాలా హితబోధ చేసి అతి కష్టం మీద కిందికి దింపారు. ఈ సందర్భంగా ఆమె పోలీసులతో మాట్లాడుతూ తన భర్త విశాఖ పోర్టుట్రస్టులో ఉద్యోగం చేస్తున్నారని, తనను కనీసం పట్టించుకోవడం లేదని, ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్నాడని ఏకరువు పెట్టింది. తనను మానసిక వేదనకు గురిచేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. ఈ తరహా తొందరపాటు నిర్ణయాలు తీసుకుని నిండుజీవితాలను నాశనం చేసుకోవద్దని పోలీసులు హితవు పలికి ఆమెకు కౌన్సెలింగ్ చేశారు. అనంతరం ఆమె తన భర్త, ఇతర కుటుంబసభ్యులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ముగ్గురు వైద్యాధికారులకు బదిలీ

నెల్లిమర్ల: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ముగ్గురు వైద్యాధికారులకు బదిలీ జరిగింది. చిన్నపిల్లల స్పెషలిస్టు డాక్టర్ కె.శ్రీనివా సరావుకు ఆముదాలవలస సీహెచ్‌సీకి బదిలీ కాగా.. పల్మనాలజిస్టు సుబ్రహ్మణ్య హరికిషన్, గైనకాలజిస్టు భారతి పాలకొండ ఏరియా ఆస్పత్రికి బది లీ అయ్యారు. పాలకొండలో పనిచేస్తున్న గైనకాలజిస్టు తిరుమలదేవి బదిలీపై నెల్లిమర్ల రానున్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- వన్‌టౌన్ సీఐ వెంకటరావు


రౌడీషీట్ కలిగిన వ్యక్తులకు అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని వన్‌టౌన్ సీఐ బి. వెంకటరావు సూచించారు. పట్టణ పరిధిలో నివసిస్తూ రౌడీషీట్ కలిగిన వ్యక్తులను సోమవారం స్టేషన్‌కి పిలిపించి అవగాహన కల్పించారు. నేర ప్రవృత్తిని విడనాడాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై అశోక్, తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 550.00
విజయనగరం	రూ. 554.00
శ్రీకాకుళం	రూ. 554.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,070-00
బంగారం(22సి. 10గ్రా.)	55,070-00
వెండి (కిలో)	79,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹155	₹280	₹ 290

జగనన్నకు చెబుదాం'కు 232 వినతులు


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి ప్రజల నుంచి 232 వినతులు అందాయి. వాటిలో అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 173 అర్జీలు వచ్చాయి. మిగిలిన వాటిలో పంచాయతీరాజ్, మున్సిపల్ కార్పొరేషన్, గ్రామ వార్డు సచివాలయ శాఖ, గృహనిర్మాణ సంస్థ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖలు, డీఆర్‌డీఏకు వినతులు అందాయి. వినతుల స్వీకరణ కార్యక్రమంలో కలెక్టర్ నాగలక్ష్మితోపాటు జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, ఆర్‌డీఏ ఎంవీసూర్యకళ, ఎస్‌డీసీలు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలీల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు పారితోషికాలు

జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు ఆరోగ్య మిత్రలకు ప్రోత్సాహక బహుమతి రూ.5 వేలు వంతున నగదు పారితోషికాలను, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ అందజేశారు. ఏప్రిల్ నెలకు సూర్యనారాయణ, మే నెలకు మక్కువ కృష్ణశంకర్‌లకు ఈ ప్రోత్సాహకాలను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కరరావు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, సమన్వయ అధికారి డాక్టర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

శాఖల సమన్వయంతో సమస్యల పరిష్కారం

పలుశాఖల సమన్వయంతో పరిష్కరించాల్సిన వినతులపై తగిన చర్యలు చేపట్టేందుకు ప్రతి సోమవారం మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులు సమావేశమై ఆయా వినతుల పరిష్కారంపై చర్చించాలని, సమష్టిగా వాటికి సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన వినతుల్లో ఆయా శాఖల ద్వారా సంతృప్తికర మైన రీతిలో పరిష్కారం కాని వినతులపై జిల్లా అధికారులతో శాఖల వారీగా సమీక్షించారు. పౌరసరఫరాలు, విద్యుత్ పంపిణీ సంస్థ, గృహనిర్మాణ సంస్థ, విద్యా శాఖ, గ్రామీణ నీటిసరఫరా, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం, పోలీసు, రోడ్లు భవనాలు తదితర శాఖల ద్వారా రీ ఓపెన్ అయిన వినతులపై సమీక్షించారు. జిల్లా అధికారులు వారి పరిధిలో అందిన వినతుల పరిష్కారంపై ప్రతి రోజూ అవి ఏ స్థాయిలో పరిష్కార దశలో ఉన్నదీ పర్యవేక్షించాలని సూచించారు. ఉన్నతాధికారులు ఆయా వినతుల పరిష్కారంపై తుది నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. తమకు సంబంధంలేని వినతులు అందినట్లయితే వెంటనే సంబంధిత శాఖకు ఆ వినతిపై సమాచారం ఇవ్వాలని తమకేమీ పట్టనట్టుగా మిన్నకుండ వద్దని హితవు పలికారు. అధికారులు తమకు వచ్చిన వినతిని అదే రోజు తెరిచి చూసి పరిష్కారం కోసం తమ పరిధిలోని ఎవరో ఒకరికి నిర్దేశించాలని చెప్పారు. సమావేశంలో జేసీ మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఆర్‌డీఓ ఎంవీసూర్యకళ, ఎస్‌డీసీలు సూర్యనారాయణ, సుదర్శన దొర, పద్మలీల, జిల్లా అధికారులు పాల్గొన్నారు.


హాజరైన వివిధ శాఖల జిల్లా అధికారులు


బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందనలో వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో బాధితుల నుంచి 36 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. బాధితులిచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, చట్టపరిధిలో బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. తీసుకున్న చర్యలను తనకు నివేదించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్పీ సీఐలు జి.రాంబాబు, ఇ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సై వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకి చెబుదాం కార్యక్రమానికి వినతులు ఇవ్వడానికి వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. ప్రజల వినతులకు సంతృప్తికర పరిష్కారం చూపించాలన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌లోని కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకటరావులతో కలిసి ప్రజల నుంచి ఆయన 98 అర్జీలు స్వీకరించారు.

అర్జీలలో కొన్ని..

- సాలూరు మండలం కురుకూటి గ్రామంలో ఫోన్ సిగ్నల్స్ సదుపాయం లేక గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారని గ్రామానికి జియో సెల్ టవర్ మంజూరు చేయాలని సర్పంచ్ వంతల ఎండమ్మ, ఉపసర్పంచ్ సాంబమూర్తి అర్జీ అందజేశారు.
- కొమరాడ మండలం బూర్జివలస, కోటిపాం గ్రామాల మధ్య బీటీ రోడ్డు మంజూరు చేయాలని సర్పంచ్ హెచ్.గంగారం, గ్రామస్తులు దరఖాస్తు అందజేశారు.
- జియ్యమ్మవలస మండలం పెదతోలుమండ గ్రామంలో జీటీడబ్ల్యూ స్కూల్‌కు ప్రహరీ నిర్మించామని, దానికి సంబంధించిన బిల్లులు చెల్లించాలని శారద వినతిపత్రం సమర్పించారు.
- మక్కువ మండలం కొండ రేజేరు గ్రామానికి చెందిన పైల సత్యనారాయణ తన కుమార్తెకు సదరం సర్టిఫికెట్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్ర రావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి. కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకరరావు, గ్రామ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్


వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి : ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: స్పందన వినతులను నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతివారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు తమ తమ పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఎస్పీ సీఐ ఎన్.శ్రీనివాస రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాశతో ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దు

- ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: అత్యాశకు పోయి ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని ఎస్పీ ఎం.దీపిక హితవు పలికారు. మెరకముడిదాం మండలం పులిగుమ్మి గ్రామానికి చెందిన బూర్లి దామోదర్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి సోమవారం దామోదర్ వచ్చి, తనలా ఇంకెవరూ ఆన్‌లైన్ మోసాలకు గురికాకూడదని ప్రజలకు విజ్ఞప్తి చేశాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో గుర్తు తెలియని వ్యక్తులు తనకు వాట్సాప్‌కు మెసేజ్ పంపగా, తాను స్పందించడం వల్ల మోసపోయానన్నాడు. ఏప్రిల్ 15 నుంచి 27 వరకూ గుర్తు తెలియని వ్యక్తులకు రూ.9.25 లక్షలను పది సార్లు పంపించానని చెప్పాడు. ఆన్‌లైన్‌లో ట్రేడింగ్ చేయడం ద్వారా పెట్టిన పెట్టుబడికి 30 శాతం లాభాలు ఇస్తామని, గుర్తు తెలియని వ్యక్తులు చెప్పిన మాటలు నమ్మి, వారు పంపిన లింకులకు డబ్బులు జమచేశానన్నాడు. మొదట్లో తాను పెట్టిన చిన్న మొత్తాలకు నమ్మకం కలిగించేందుకు లాభాలను పంపిన సదరు వ్యక్తులు, ఎక్కువ మొత్తంలో నగదు పంపినప్పుడు ఇంకా డబ్బులు పంపాలని, పదే పదే మెసెజ్‌లు చేయడం, తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోవడం , తన డబ్బులు ఇవ్వడానికి మరో రూ. 5 లక్షలు ఇవ్వాలని చెప్పడంతో తాను మోసపోయినట్లు గుర్తించానన్నాడు. వెంటనే బుదరాయవలస పోలీసు స్టేషన్‌లో ఆధారాలతో ఫిర్యాదుచేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారని, చీపురుపల్లి సీఐ జి.సంజీవరావు ఆధ్వర్యంలో పోలీస్ బృందం తాను అందించిన వివరాలతో ఆన్‌లైన్ మోసగాళ్ల వివరాలు సేకరించి, తాను పోగొట్టుకున్న రూ. 9.25 లక్షల్లో రూ.8.24 లక్షలు రికవరీ చేశారని చెప్పాడు. తనలా ఇంకెవరూ అత్యాశతో ఆన్‌లైన్ మోసాలకు గురికావద్దని, అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసి, ఎస్పీ ఎం.దీపికకు కృతజ్ఞతలు తెలిపాడు.


ఎస్పీ ఎం.దీపికకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్న దామోదర్

అందరూ అప్రమత్తంగా ఉండాలి

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని, గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులు, మెసేజ్‌లు, ఈ మెయిల్స్‌కు స్పందించవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే, వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లోనూ, 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు.

తాడ్డి మృతిపై నేతల సంతాపం

- పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు

గజపతినగరం: ప్రముఖ సీనియర్ రాజకీయ నాయకుడు మాజీ ఎమ్మెల్యే తాడ్డి సన్యాసినాయుడు మృతి గజపతినగరం, మెంటాడ నియోజకవర్గం ప్రజలకు తీవ్రదిగ్భ్రాంతిని మిగిల్చిందని పలువురు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, టీడీపీ, జనసేన, బీజేపీ, సీపీఐ, సీపీఎం తదితర రాజకీయ పార్టీ నేతలు విచారం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం తాడ్డి సన్యాసినాయుడు పార్థివ దేహాన్ని చూసేందుకు గజపతినగరంలోని ఆయన స్వగృహం వద్దకు పలువురు నేతలు, ప్రజలు వచ్చారు. ఎమ్మెల్యేగా రెండుసార్లు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌గా పదవులు చేపట్టి ప్రజలకు ఎన్నో సేవలు అందించిన సౌమ్యుడు తాడ్డి సన్యాసినాయుడు మృతి తీరని లోటు అని వారంతా అన్నారు. ఈ సందర్భంగా ఆయన పార్థివ దేహానికి విజయనగరం పార్లమెంటు సభ్యుడు (ఎంపీ) బెల్లాన చంద్రశేఖర్, స్థానిక శాసన సభ్యుడు బొత్స అప్పలనరసయ్య, పాలవలస విక్రాంత్(ఎమ్మెల్సీ), టీడీపీ మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి, స్థానిక జెడ్పీటీసీ గారతవుడు, బొండపల్లి జెడ్పీటీసి రాపాక సూర్యప్రకాశ్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ దేవర ఈశ్వరరావు, పలువురు ఎంపీపీలు, ఎంపీటీసీలు, జనసేన నాయకులు, డాక్టర్ బీఎస్సార్ మూర్తి, గజపతినగరం, మెంటాడ నియోజకవర్గాలకు చెందిన పలువురు సర్పంచ్‌లు, వైస్ సర్పంచ్‌లు, మాజీ జెడ్పీటీసీలు, అభిమానులు, పెద్దలు సన్యాసినాయుడు పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.


తాడ్డి నివాసానికి చేరుకున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, ఇతర పార్టీలకు చెందిన నేతలు

22న యువజనోత్సవాలు

- నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో యువజనోత్సవాలను ఈ నెల 22న నిర్వహిస్తున్నామని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కె.వెంకట్ ఉజ్వల్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు కేంద్ర యువజన వ్యవహారాలు క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువకేంద్రం, ఎస్‌వీ. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో పార్వతీపురంలోని అద్దాపుశీల ఎస్‌వీడీ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న భారతదేశం 2047 అనే థీమ్‌తో సృజనాత్మక రచన, కవిత్వం, చిత్రలేఖనం, మొబైల్ ఫొటోగ్రఫీ, ఉపన్యాసం, సాంస్కృతిక, జానపద కళలు వంటి అంశాలపై యువ ఉత్సవ్ నిర్వహించనున్నామని వివరించారు. ఆయా విభాగాలలో గెలుపొందిన విజేతలకు నగదు బహుమతి, ధ్రువీకరణ పత్రాలు అందజేయడమే కాకుండా ప్రతిభావంతులకు జాతీయ స్థాయి యువ ఉత్సవ్‌కు వెళ్లే అవకాశం కల్పిస్తామన్నారు. యువ ఉత్సవ్ పోటీలలో పాల్గొనదలచిన 15 నుండి 29సంవత్సరాల వయస్సు లోపు ఉన్న యువ ఔత్సాహికులు వారి వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకుని పోటీలలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు పార్వతీపురం మన్యం నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో గానీ ఫోన్ 7386325310 నంబర్‌ను గానీ సంప్రదించాలని కోరారు.


నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి కె.వెంకట్ ఉజ్వల్

పేలిన గ్యాస్ సిలిండర్

- కాలిపోయిన గ్రైండర్, ఫ్యాన్లు, మిక్సీలు
- సుమారు రూ.1.50 లక్షల ఆస్తినష్టం

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేట గ్రామంలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో గుడివాడ వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న టీ దుకాణం అగ్నికి ఆహుతైంది. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, వీఆర్‌ఓ సత్యవతి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గేదెల పావని టీ దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తోంది. సోమవారం ఎప్పటిలాగే టీ దుకాణం కట్టేసి ఇంటికి వెళ్లిపోయింది. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్ పేలడంతో దుకాణంలో ఉన్న గ్రైండర్, మిక్సీ, ఫ్యాన్లు, విద్యుత్ పరికరాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆ సమయంలో దుకాణంలో, సమీపంలో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంతో ఒక్కసారిగా గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపుచేశారు. సమాచారం తెలుసుకున్న వీఆర్‌ఓ సత్యవతి, గ్రామ ఉపసర్పంచ్ వంటాకు శ్రీను ప్రజల సమక్షంలో స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని రూ.1.50 లక్షల నష్టం జరిగి ఉండవచ్చని అంచనా వేశారు. ప్రమాద వివరాలను తహసీల్దార్‌కు నివేదిస్తామని వీఆర్‌ఓ తెలిపారు.


సిలిండర్ పేలడంతో చెలరేగిన మంటలు

వైఎస్సార్ పశుబీమాతో రైతులకు ప్రయోజనం

- కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: రైతుకు అధిక ప్రయోజనకరమైన వైఎస్సార్ పశుబీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ నాగలక్ష్మి కోరారు. పశు పోషణపై ఆధారపడిన పశుపోషకులకు ఆపత్కాలంలో ఈ పథకం ఆదుకుంటుందన్నారు. పథకానికి సంబంధించిన పోస్టర్లను, కరపత్రాలను కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మేలుజాతి పశువులు, నాటు పశువులు, గొర్రెలు, మేకలు, పందులకు సైతం నిర్ణీత మొత్తాన్ని చెల్లించి బీమా సదుపాయాన్ని పొందవచ్చన్నారు. వరదలు, తుపానులు, పిడుగుపాటు, పాముకాటు, అడవిజంతువుల దాడి, అగ్నిప్రమాదం, రోడ్డు ప్రమాదం, జబ్బు చేసి చనిపోవడం వంటి సందర్భాల్లో బీమా పథకం వర్తిస్తుందన్నారు. బీమా చేయించుకున్న పశువులకు ఆయా జాతి, వయసును బట్టి రూ.30 వేలు నుంచి రూ.15 వేల వరకు, గొర్రెలు, మేకలు, పందులకు ఒక్కోదానికి రూ.6 వేలు వరకు పరిహారం పొందే అవకాశం ఉందన్నారు. ప్రీమియం చెల్లించిన 24 గంటల తరువాత పథకం వర్తిస్తుందని, 21 రోజుల్లోగా బీమా సొమ్ము అందుతుందని తెలిపారు. పథకానికి సంబంధించిన ఇతర వివరాలకు కోసం టోల్ ఫ్రీ నంబర్ 1962ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జేసీ మయూర్‌అశోక్, డీఆర్వో ఎం.గణపతిరావు, కేఆర్‌ఆర్‌సీ ఎస్‌డీసీ సూర్యనారాయణ, పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ పశుబీమా పథకం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్‌అశోక్

నేషనల్ అవార్డుకు ఎంపికైన న్యాయవాదికి సత్కారం


గజపతినగరం: మండలంలోని పురిటి పెంట న్యూ కాలనీలో నివాసం ఉంటున్న న్యాయవాది గెద్దాడ సూర్యనారాయణ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ నేషనల్ అవార్డును ఇటీవల అందుకోవడంతో ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు సహచర న్యాయవాదులు తెలిపారు. ఈ మేరకు సోమవారం స్థానిక సివిల్ కోర్టులో బార్‌అసోషియేషన్ సభ్యులు సూర్యనారాయణను శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ గోదావరి ఆడిటోరియంలో వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు చిన్నారావు ఆధ్వర్యంలో కేంద్రవాణిజ్యశాఖ కమిషనర్ ఎస్.రవికుమార్ చేతుల మీదుగా తమ సహచర న్యాయవాది అందుకోవడం చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. అక్షర విజయం, పల్స్‌పోలియో, బాల కార్మికుల నిర్మూలన, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని సొంతంగా పాటలు రచించి ప్రదర్శించినందుకు గాను ఈ అవార్డు ఆయనకు లభించినట్లు న్యాయవాదులు తెలిపారు. కార్యక్రమంలో ఉప్పలపాటి రమేష్, కొల్లూరి సాయిశేఖర్, పొట్నూరు శ్రీనివాసరావు, రాపాక సాయిసురేష్, రామానాయుడు, జెర్రిపోతుల జగదీష్, కె.చరిష్మా, అప్పలనాయుడు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేటలో ఉంటున్న శరకాన సత్యనారాయణ(45) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై ఎస్.రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెంటాడ మండలం, గుర్ల గ్రామానికి చెందిన శరకాన సత్యనారాయణ కొన్ని సంవత్సరాల క్రితం తన అత్తవారి ఊరు బోడసింగిపేట గ్రామానికి వచ్చి టీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్న సత్యనారాయణను విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కొడుకు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరివేసుకుని మరో వ్యక్తి..

చీపురుపల్లిరూరల్: మండలంలోని మెట్టపల్లి గ్రామంలో గల ఎస్సీ కాలనీకి చెందిన బోనెల గొల్లబాబు(41) గ్రామానికి సమీపంలో గల చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.ఈ సంఘటనకు సంబంధించి మృతుని భార్య ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గొల్లబాబు కుటుంబంతో గ్రామంలో వ్యవసాయ పనులు చేస్తూ మరోవైపు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గొల్లబాబుకు ఆదివారం సాయంత్రం 7గంటల సమయంలో లావేరుమండలం అప్పాపురం గ్రామానికి చెందిన యండ రమణి అనే మహిళ ఫోన్ చేసి వారి మధ్యన ఉన్న వివాహేతర సంబంధం తన భర్తకు తెలిసిపోయిందని, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే ఇద్దరి పరువు పోతుందని చెప్పింది. దీంతో తన భర్త మనస్తాపం చెందాడని మృతుడి భార్య ఫిర్యాదులో పేర్కొంది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి వెళ్లి ఎంతోసేపటికీ తిరిగి రాలేదని, దీంతో వెతకగా గ్రామానికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది కనిపించాడని ఫిర్యాదులో వివరించింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఆత్మహత్యకు పాల్పడిన గొల్లబాబు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పార్వతీపురం: కొమరాడ మండలం విక్రాంపురం గ్రామానికి చెందిన ఎస్. రామినాయుడు పెరుగుకోసం వెళ్లి ఇంటికి వస్తుండగా కొమరాడ నుంచి పార్వతీపురం వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తల, కాలికి గాయాలయ్యాయి. ఈ మేరకు రామినాయుడిని చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి స్థానికులు, కుటుంబసభ్యులు తరలించారు. ఫిర్యాదు మేరకు అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న రామినాయుడు